క్లుప్తంగా

కార్పొరేషన్ పదవుల్లో బీసీలకు తీవ్ర అన్యాయం

మిర్యాలగూడ టౌన్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నియమించిన 37కార్పొరేషన్ చైర్మన్ పదవుల్లో బీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం గౌడ్ అన్నారు. ఆదివారం స్థానికంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇందిరమ్మ రాజ్యంలో సామాజిక న్యాయం జరిగి ప్రజా పాలన జరుగుతుందని అనుకుంటే ఈ ప్రభుత్వంలో కూడా మెజార్టీగా ఉన్న బీసీలకు అన్యాయమే జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన 37 కార్పొరేషన్ చైర్మన్లలో జనాభా ప్రాతిపదికన సగానికి పైగా ఉన్న బీసీలకు కేవలం 13 కార్పొరేషన్ మాత్రమే కేటాయించిందని, అగ్రకులాల వారికి 17 కార్పొరేషన్ చైర్మన్లను కేటాయించిదన్నారు. కేవలం ఒక్క కులానికి ఇస్తే ప్రజాపాలన అవుతుందా అని ప్రశ్నించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికైనా ఒంటెద్దు పాకడలను మానుకోవాలని అన్నారు.

యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీగా రాకేష్



నల్లగొండ రూరల్: యూత్ కాంగ్రెస్ జిల్లా జనరల్ సెక్రటరీగా నల్లగొండ మండలంలోని నర్సింగ్ బట్ల గ్రామానికి చెందిన పుట్టా రాకేష్ ముదిరాజ్‌ను నియమిస్తూ యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. తన నియామకానికి సహకరించిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

చైల్డ్ కేర్ సెంటర్‌లో బియ్యం పంపిణీ



చారుమతిలో విద్యార్థులకు బియ్యం అందజేస్తున్న సీఐ

నల్లగొండ రూరల్: నల్లగొండ టూటౌన్ సీఐ డానియల్ కుమార్తె మోక్షజ్ఞ జన్మదినం సందర్భంగా పట్టణంలోని చారుమతి చైల్డ్ కేర్ సెంటర్‌లో ఆదివారం అనాథ విద్యార్థులకు బియ్యం, పండ్లు, బిస్కెట్లు అందజేశారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు.

నేడు వైద్య శిబిరం

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని వేపల సింగారంలో సోమవారం వైద్య శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు మండల వైద్యాధికారిణి డాక్టర్ పుష్పలత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలో జ్వరం, ఒళ్లు నొప్పులతో ఇబ్బందులు పడుతున్న వారికి రక్త నమూనాలు సేకరించనున్నట్లు పేర్కొన్నారు.

పటేల్ రమేశ్‌రెడ్డికి సన్మానం



పటేల్ రమేష్‌రెడ్డిని సన్మానిస్తున్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాసుల సత్యం

మిర్యాలగూడ టౌన్ : తెలంగాణ రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియామకమైన పటేల్ రమేష్‌రెడ్డిని ఆదివారం సూర్యాపేటలోని ఆయన నివాసంలో రాష్ట్ర టీడీపీ కార్యదర్శి కాసుల సత్యం శాలువాతో సత్కరించారు. అనంతరం ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఆయన వెంట దారోజు జానకిరాములు తదితరులున్నారు.

విద్యార్థులకు మండల స్థాయి టాలెంట్ టెస్ట్



బహుమతులు ప్రదానం చేస్తున్న నాయకులు

నకిరేకల్: నకిరేకల్‌లోని ఎస్‌పీఆర్ స్కూల్‌లో ఆదివారం పదో తరగతి విద్యార్థులకు ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో మండల స్థాయి టాలెంట్ పరీక్షలు నిర్వహించారు. ఈసందర్భంగా ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి యాట మధుసూదన్‌రెడ్డి, మల్లం మహేష్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ డివిజన్ కార్యదర్శి ముస్కు రవీందర్, ఎస్‌పీఆర్ స్కూల్ కరస్పాండెంట్ బి.కన్నయ్యగౌడ్, పాఠశాల ఉపాధ్యాయులు వెంకటేషం, పాల్గొన్నారు.

కార్పొరేషన్ చైర్మన్ నియామకంపై హర్షం

కేతేపల్లి: తెలంగాణ రాష్ట్ర వికలాంగుల విభాగం కార్పొరేషన్ చైర్మన్‌గా పెరిక కార్పొరేషన్ సాధన సమితి అధ్యక్షుడు ముత్తినేని వీరయ్యను ప్రభుత్వం నియమించటం పట్ల ఆ సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కోట మల్లికార్జునరావు హర్షం వ్యక్తం చేశారు.

ఆయకట్టులో గడ్డికి గడ్డుకాలం!

- గతేడాదితో పోలిస్తే తగ్గిన వరిసాగు
- మిషన్ల వరికోతతో మరింత కొరత
- పాడి రైతులకు భారంగా మారిన పశుపోషణ



లారీలో అమ్మకానికి సిద్ధంగా ఉన్న ఎండు గడ్డి



రైతు ఏర్పాటు చేసుకున్న ఎండు గడ్డి

హాలియా : పాడి రైతులకు గడ్డు రోజులు ఎదురవుతున్నాయి. ఆయకట్టు పరిధిలో ఎండుగడ్డి కొరత తీవ్రంగా ఉండడంతో రైతులకు పశుపోషణ రోజురోజుకు భారంగా మారుతోంది. నాగార్జునసాగర్ నియోజకవర్గంలోని ఎడమ కాల్వ ఆయకట్టు పరిధిలోని గతేడాది నీరు సమృద్ధిగా ఉన్న కారణంగా యాసంగిలో సుమారు లక్షా 20వేల ఎకరాలకు పైగా వరిసాగు చేయగా, ఈ ఏడాది ఎడమ కాల్వకు నీటిని విడుదల లేనికారణంగా ఆయకట్టు పరిధిలోని బోరు, బావుల కింద రైతులు యాసంగిలో 76వేల ఎకరాలు మాత్రమే వరిసాగు చేశారు. గతేడాది పోల్చితే ఈ ఏడాది ఆయకట్టులో సాగు విస్తీర్ణం తగ్గింది. ఆయకట్టులో కొద్దొగొప్పా రైతులు సాగు చేసిన వరిసాగుకు కూలీల కొరత వేధిస్తుండడంతో చాలా మంది రైతులు వరి కోత మిషన్ల(హార్వేస్టర్స్)తో వరిని కోయిస్తున్నారు. దీంతో ఎండుగడ్డి ఆశించినస్థాయిలో రావడంలేదు. ఇదివరకు ఆయకట్టు కింద చాలా మంది రైతులు వరిని సాగు చేయడంతో ఎండుగడ్డి పుష్కలంగా లభించేంది. ప్రస్తుతం సాగు తగ్గడంతో పశుగ్రాసానికి తీవ్ర ఆటంకం ఏర్పడింది. నియోజకవర్గంలోని పాడి రైతులు వరి గడ్డి కోసం సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్ ప్రాంతాల నుంచి లారీలు, ట్రాక్టర్లలో తెచ్చుకుంటున్నారు. గడ్డి కొరత ఎక్కువగా ఉండడంతో ధరలు ఆమాంతం పెరిపోయాయి. పాడి రైతులు వరి గడ్డిని కొనలేక ఎక్కువ శాతం పచ్చిమేత, దాణా మీద ఆధారపడుతున్నారు.

పెరిగిన వరిగడ్డి ధరలు

వరిగడ్డి ధరలు ఈ సీజన్‌లో రెట్టింపయ్యాయి. గతంలో ఒక ట్రాక్టర్ వరి గడ్డి రూ.6వేల నుంచి రూ. 10వేల వరకు కాగా ఈ సీజన్‌లో రూ.9వేల నుంచి 15వేలు పలుకుతోంది. లారీ వరి గడ్డి సుమారు 25 వేల నుంచి రూ. 30 వేల వరకు పెరిగింది. దీంతో రైతులకు వరిగడ్డి దొరకక పశుపోషణ భారంగా మారింది. పాడి రైతులు గడ్డి ధరలు విపరీతంగా పెరగడంతో ప్రత్యామ్నాయంగా పచ్చిగడ్డితో పాటు దాణాలను వాడుతున్నారు. మార్కెట్‌లో పశువులు దాణా ధరలు సైతం విపరీతంగా పెరిగాయి. కొంత మంది పాడి రైతులు పాల నుంచి లాభాలు రాకున్నా అప్పులు చేసి పశువులకు పశుగ్రాసం, దాణాలు పెడుతున్నారు. గతంలో పశుసంవర్థక శాఖ ద్వారా పాడి రైతులకు గడ్డి విత్తనాలు సబ్సిడీపైన అందజేసేవారు. ప్రస్తుతం అలాంటి పరిస్థితి లేకుండా పోయింది.

ధరలు విపరీతంగా పెరిగాయి



ఎండు గడ్డి ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. ప్రతి రోజు పాడి గేదెలకు పచ్చిమేతతో పాటు కొంత వరి గడ్డిని వేస్తున్నాను. ధరలు పెరగడంతో ఎండు గడ్డిని కొనలేని పరిస్థితి నెలకొంది. తప్పని పరిస్థితిలో చాలా మంది రైతులు అప్పులు చేసి మరి అధిక ధరకు వరి గడ్డిని కొంటున్నారు.

–లింగాల యశ్వంత్, పాడి రైతు, ఇబ్రహీంపేట

పశుగ్రాసం కొరత తీవ్రంగా ఉంది



ఆయకట్టులో ఈ ఏడాది వరిసాగు విస్తరణ తగ్గడంతో పాడి రైతులకు పశుగ్రాసం కొరత తీవ్రంగా ఉంది. రైతులు ఇతర ప్రాంతాల నుంచి అధిక ధరలు వెచ్చించి వరిగడ్డి కొనుగోలు చేస్తున్నారు. ధరలు సైతం విపరీతంగా పెరిగాయి. గతంలో గడ్డి కట్ట రూ. 50లు ఉంటే ఇప్పుడు గడ్డి కట్ట రూ. 80 నుంచి రూ. 90లు ధర పలుకుతోంది.

– ఎండీ అక్బర్‌ఖాన్, రైతు, అలీనగర్

బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిక



పార్టీలో చేరిన వారితో జానారెడ్డి, జైవీర్‌రెడ్డి

నిడమనూరు : మండలంలోని ముప్పారానికి చెందిన వేంకటేశ్వర స్వామి దేవస్థానం మాజీ చైర్మన్ మేరెడ్డి వెంకటరమణ బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసి ఆదివారం ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఆయనకు జైవీర్‌రెడ్డి, జానారెడ్డిలు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో మేరెడ్డి వెంకటరమణ సతీమణి ముప్పారం మాజీ సర్పంచ్, గంగాదర్, కంచి సైదయ్య, అలంపల్లి నరేష్, ఆదిముళ్ల కొండల్, జిల్లా పెద్దులు, దాసరి రాముడు, రూపని లక్ష్మీనారయణ, చెర్కుపల్లి శ్రీను, నాగరాజులతో పాటు మరికొంత మంది పార్టీ చేరిన వారిలో ఉన్నారు.

స్నేహితుడికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న మిత్రులు

మిర్యాలగూడ టౌన్ : మండలంలోని జప్తీవీరప్పగూడెం గ్రామానికి చెందిన ఎస్‌కె రబ్బానీ ఇటీవల బైక్ ప్రమాదంలో గాయపడ్డాడు. దీంతో రబ్బాని ఆర్థికంగా ఇబ్బందులు పడుతుండడంతో అతడి స్నేహితులు, గ్రామ యువకులు సేకరించిన రూ.లక్ష లను ఆర్థిక సాయంగా ఆదివారం అందజేశారు. ఆర్థిక సాయం ఇచ్చేందుకు ముందుకు వచ్చిన దాతలందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నారబత్తుల ఉదయ్‌కుమార్, రాంబాబు, గోవర్ధన్, మోహన్, సతీష్, గోపి, ఎస్‌కె సైదా, హరిబాబులతో పాటు పలువురు స్నేహితులు, యువకులు, దాతలు పాల్గొన్నారు.

ఆప్ బలోపేతానికి కృషి చేయాలి

మిర్యాలగూడ అర్బన్ : రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కార్యకర్తలు కలికట్టుగా పని చేసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆమ్‌ఆద్మీ(ఆప్) పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎండీ.కుతుబుద్దీన్ అన్నారు. ఆదివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యకర్తలు తమ నియోజకవర్గాల్లో అధిక సంఖ్యలో సభ్యత్వాలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కోర్‌కమిటీ నాయకులు డాక్టర్ అన్సారీ, జిల్లా కార్యదర్శి యార శ్రీను, పురుషోత్తంరెడ్డి, కీర్తి అశోక్, అద్దంకి రవీందర్, చేగొండి మహేందర్, వెంకటసుబ్బయ్య, అయ్యప్ప శర్మ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కుతుబుద్దీన్

అవినీతిపై విచారణ జరిపించాలి



మిర్యాలగూడ అర్బన్ : మాట్లాడుతున్న సైదానాయక్



దేవరకొండ : మాట్లాడుతున్న వెంకటేష్

మిర్యాలగూడ అర్బన్ : వెనకబడిన తరుగతుల సంక్షేమ హాస్టల్ వర్కర్ల విషయంలో జరిగిన అవినీతిపై జిల్లా ఉన్నతాధికారులు స్పందించి విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షులు కుర్ర సైదానాయక్ అన్నారు. ఆదివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో యన మాట్లాడారు. జిల్లాలో బీసీ సంక్షేమ హాస్టళ్లలో వర్కర్ల సమస్య విపరీతంగా ఉందని, విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్నచోట వర్కర్ల అవసరం ఉందని చాలా సార్లు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ డివిజన్ అధ్యక్షులు జగన్, నాయకులు వదుద్, శివ, ముని తదితరులు పాల్గొన్నారు.

దేవరకొండ : జిల్లాలోని వెనుకబడిన తరగతుల సంక్షేమ హాస్టళ్ల వర్కర్ల విషయంలో జరిగిన అక్రమాలపై కలెక్టర్ విచారణ చేపట్టాలని ఎస్‌ఎఫ్‌ఐ దేవరకొండ డివిజన్ కార్యదర్శి బుడిగ వెంకటేష్ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలో ఏర్పాటు చేసిన ఎస్‌ఎఫ్‌ఐ దేవరకొండ మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల జిల్లా వ్యాప్తంగా నూతనంగా నియామకమైన 62మంది వర్కర్ల నుండి డబ్బులు వసూలు చేశారని ఆయన ఆరోపించారు. వర్కర్ల విషయంలో లక్షల్లో అవినీతి జరిగిందని ఇందుకు సంబంధించి పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. లేని పక్షంలో జిల్లావ్యాప్తంగా ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో దున్న రవి, తరుణ్, ఆంజనేయులు, ముత్యం, రమేష్ పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజస్తంభం ఊరేగింపు



ధ్వజస్తంభానికి పూజలు చేస్తున్న సిద్ధాంతి

మిర్యాలగూడ టౌన్ : మండలంలోని వెంకటాద్రిపాలెంలోని వీరబ్రహ్మంద్రస్వామి దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవంలో భాగంగా ఆదివారం ధ్వజస్తంభం ఊరేగింపును వైభవంగా నిర్వహించారు. ముందుగా సిద్ధాంతి వేదమంత్రోత్సవాలతో ధ్వజస్తంభానికి పూజలు నిర్వహించారు. అనంతరం జలాధివాసం, మంత్ర పుష్పం, మంగళహారతి నిర్వహించారు. ఈ ఊరేగింపులో భక్తులు పెద్దఎత్తున హారతులు ఇచ్చారు. ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షులు అన్నబిమోజు నాగార్జునాచారి, కార్యనిర్వాహక అధ్యక్షులు చేర్యాల వెంకటాచారి, అధ్యక్షులు చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి గోవర్ధనాచారి, కోశాధికారి సైదాచారి, ఉపాధ్యక్షులు శ్రీనివాస్, నర్సింహ్మాచారి, గోవర్దనాచారి, బారెడ్డి అశోక్‌రెడ్డి, ఏడుకొండలు, రవీందర్‌రెడ్డి కార్యదర్శులు దుర్గాప్రసాద్, వాసుదేవాచారి, సత్యనారాయణచారి, రామాచారి, రవీంద్రనాయక్ పాల్గొన్నారు.

కుమ్మరులకు కార్పొరేషన్ పదవులు ఇవ్వాలి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కొండమల్లేపల్లి : కుమ్మరులకు కార్పొరేషన్ ఏర్పాటు చేసి నామినేటెడ్ పదవులు ఇవ్వాలని కుమ్మరి శాలివాహన సంఘం దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షుడు తోటపల్లి కిరణ్ అన్నారు. ఈమేరకు కుమ్మరుల సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం కుమ్మరుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆదివారం దేవరకొండ ఎమ్మెలే బాలునాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుమ్మరులు ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా, వృత్తిపరంగా, విద్యా, ఉద్యోగపరంగా వెనుకబడి ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం కుమ్మరులకు చట్ట సభల్లో అవకాశం కల్పించాలన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో రాష్ట్ర యువజన సంఘం అధ్యక్షుడు ఎలిమినేటి సాయి, మండల అధ్యక్షుడు ఏరుకొండ రాము, ఘనపురం వెంకటేశ్వర్లు, బొడ్డుపల్లి సైదులు, మాడ్గుల యాదగిరి, నాయకులు బొడ్డుపల్లి శంకర్, తోటపల్లి వెంకటయ్య, బొడ్డుపల్లి మల్లేశ్, తిరుపతయ్య, యాదయ్య, దామోదర్, జంగయ్య, సైదులు, శ్రీనివాస్, సురేష్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి



హాలియాలో పరీక్ష ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడుతున్న ఎంఈఓ బాలునాయక్



పెద్దవూరలో నంబర్లు వేస్తున్న ఎంఈఓ బాలునాయక్

హాలియా : నేటి నుంచి ప్రారంభయ్యే పదో తరగతి పరీక్షలకు హాలియాలో నాలుగు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు మండల విద్యాధికారి బాలునాయక్ తెలిపారు. అనుముల మండల వ్యాప్తంగా 725 మంది ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నట్లు చెప్పారు. హాలియా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 220 మంది, నిర్మల హైస్కూల్‌లో 200 మంది, సెంట్ జాన్ కేరళ మోడల్ స్కూల్‌లో 131 మంది, కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో 174 మంది విద్యార్థులకు సెంటర్లు ఏర్పాటు చేశామన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేసినట్లు పేర్కొన్నారు.

డిండి : నేటి నుంచి ప్రారంభమయ్యే పదో తరగతి పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు పరీక్షా కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ప్రిన్సిపాల్స్ ఆర్.కర్ణాకర్, పద్మ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆదర్శ పాఠశాలలో 161, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 210 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లు తెలిపారు. పరీక్షా సమయం ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఉంటుందని పేర్కొన్నారు.

త్రిపురారంలో 394మంది

త్రిపురారం : మండల కేంద్రంలో త్రిపురారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కంపాసాగర్ గ్రామ పంచాయతీ పరిధిలోని టీఎస్ మోడల్ స్కూల్‌లో పదవ తరగతి పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని, 394 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నారని త్రిపురారం మండల ఎంఈఓ బాలాజీ నాయక్ అన్నారు. ఆదివారం మండలంలో విలేకరులతో మాట్లాడారు. పరీక్ష సమయంలో మండల కేంద్రంలో ఉన్న అన్ని జీరాక్స్ సెంటర్లు మూసివేయాలని కోరారు.

పెద్దవూరలో రెండు, సాగర్‌లో రెండు పరీక్ష కేంద్రాలు

పెద్దవూర : నేటి నుంచి నిర్వహించనున్న పదో తరగతి పరీక్షలకు పెద్దవూర మండల కేంద్రంలో రెండు, నాగార్జునసాగర్‌లో రెండు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పెద్దవూరలో జెడ్పీహెచ్‌ఎస్ పరీక్షా కేంద్రంలో 240 మంది, న్యూకిడ్స్ పబ్లిక్ ఉన్నత పాఠశాల కేంద్రంలో 169 మంది విద్యార్థులు మొత్తం 409 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నట్లు ఆయన తెలిపారు. అదే విధంగా నాగార్జునసాగర్‌లోని సెయింట్ జోసెఫ్ పాఠశాలలో 170 మంది, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 139 మంది కలిపి మొత్తం 309 మంది హాజరు కానున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాలలో సీసీ కెమెరాలను సైతం ఏర్పాటు చేసినట్లు, పరీక్షలు నిర్వహించే రోజులలో 144 సెక్షన్ అమలలో ఉంటుందని, విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు అరగంట ముందే చేరుకోవాలని పేర్కొన్నారు. ఆయన వెంట సీఎస్‌లుగా శేషు, ప్రభుదాస్, కె.శ్రీనివాస్, కూర్మారెడ్డి, డీఓలుగా దాస వెంకన్న, నాగేశ్వర్, జార్జ్, షాబుద్దీన్‌లు ఉన్నారు.

నేటి నుంచి పదవ తరగతి పరీక్షలు

కొండమల్లేపల్లి : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఎస్సీ గురుకుల పాఠశాల, నాగార్జున గ్రామర్ స్కూల్, మటిల్డా ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. నాలుగు పరీక్ష కేంద్రాల్లో సుమారు 750మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. కాగా పరీక్ష కేంద్రాలకు కేటాయించిన చీఫ్ ఎగ్జామినర్లను కేటాయించారు.

సమాజ సేవలో యువత ముందుండాలి



హాలియా : ఇబ్రహీంపేటలో శ్రమదానం చేస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు



మిర్యాలగూడ అర్బన్ : యాద్గార్‌పల్లి లో డ్రెయినేజీలను శుభ్రం చేస్తున్న వలంటీర్లు

హాలియా : సమాజ సేవలో యువత ముందుండాలని హాలియా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ సీహెచ్ రాజు అన్నారు. పట్టణంలోని ప్రభుత్వం డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో ఆదివారం మున్సిపాలిటీ పరిధిలోని ఇబ్రహీంపేటలో రెండో రోజు నిర్వహించిన ఎన్‌ఎస్‌ఎస్ (జాతీయ సేవా పథకం) శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సమాజ సేవలో విద్యార్థులు భాగస్వాములు కావాలన్నారు. గ్రామాల అభివృద్ధిలో తమ వంతుగా సేవ చేయడం విద్యార్థుల సామాజిక బాధ్యతగా గుర్తించాలన్నారు. ఎన్‌ఎస్‌ఎస్ శిబిరంలో భాగంగా కళాశాల విద్యార్థులు గ్రామంలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. రామాలయం ప్రాంగణంతో పాటు పలు వీధులో పిచ్చిమొక్కలు, చెత్తను తొలగించి పరిసరాలను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు పుష్ప, రాంబాబు, అధ్యాపకేతర బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం

మిర్యాలగూడ అర్బన్ : కేఎన్‌ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శీతాకాల ప్రత్యేక శిబిరంలో భాగంగా మూడో రోజు మండలంలోని యాద్గార్‌పల్లి గ్రామంలో రోడ్లకు ఇరువైపులా ఉన్న డ్రెయినేజీలను శుభ్రం చేశారు. అనంతరం పాఠశాలలో ఉన్న పిచ్చిమొక్కలను తొలగించారు. ఆదివారం ఎన్‌ఎస్‌ఎస్ శిబిరాన్ని మహాత్మాగాంధీ ఎన్‌ఎస్‌ఎస్ విభాగం జూనియర్ అసిస్టెంట్ రామరాజు హరికిషన్‌రావు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో పచ్చదనం, పరిశుభ్రతపై ప్రజలకు చైతన్యం కల్పిస్తూ వారితో మమేకమై పని చేస్తున్న వాలింటర్లను అబినందింస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ నర్సింగ్ కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏబీవీపీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు వినతి

దేవరకొండ : దేవరకొండ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో మూత్రశాలల సౌకర్యం లేకపోవడంతో విద్యార్థినులు ఇబ్బందులకు గురవుతున్నారని ఏబీవీపీ నాయకులు యలమల గోపిచంద్ అన్నారు. పాఠశాలలో మూత్రశాలల నిర్మాణం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆదివారం దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఆరో నెలలుగా పాఠశాల విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారని, పలుమార్లు అధికారులకు విన్నవించినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నేటి నుండి ప్రారంభం కానున్న పది పరీక్షలను దృష్టిలో ఉంచుకొని సమస్యను పరిష్కరించాలని వినతిపత్రంలో కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో లింగాల రాకేష్, యశ్వంత్, రాము, తదితరులున్నారు.



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

దర్వేశిపురం ఆలయం వద్ద భక్తుల సందడి

కనగల్: దర్వేశిపురం(పర్వతగిరి) శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద ఆదివారం భక్తులు రద్దీ నెలకొంది. నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి కుటుంబసభ్యులతో కలిసి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ సిబ్బంది ఆయనకు అమ్మవారి ఆశీర్వచనం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ అల్లుబెల్లి నర్సింహారెడ్డి, ఈఓ జల్లేపల్లి జయరామయ్య, అర్చకులు మల్లాచారి, శ్రవణాచారి, దామోదర్, మహేష్, సిబ్బంది చంద్రయ్య, లింగయ్య, నాగరాజు, ఉపేందర్‌రెడ్డి, లింగస్వామి ఉన్నారు.



పూజలు చేస్తున్న డీఎస్పీ కుటుంబ సభ్యులు

ముదిమాణిక్యంలో నీటి ఎద్దడి



గ్రామ పంచాయతీ ట్యాంకర్ వద్ద నీటిని పట్టుకుంటున్న ప్రజలు

అడవిదేవులపల్లి : మండలంలోని ముదిమాణిక్యం గ్రామంలో నీటి ఎద్దడి నెలకొంది. ప్రస్తుతం వస్తున్న మిషన్ భగీరథ నీరు గ్రామంలో సరిపడా రాకపోవడంతో గ్రామంలో నీటి ఎద్దడి నెలకొంది. మిషన్ భగీరథ నీరు రెండు, మూడు రోజులకు ఒక్కసారి రావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అదే విధంగా మంచినీటి ట్యాంకు వద్ద వేసి బోరు నీరు భూగర్భ జలాలు తగ్గడంతో మంచి నీటి కొరత ఏర్పడింది. కృష్ణానది పక్కనే ఉన్నప్పటికీ ప్రజల దాహార్తిని తీర్చలేకపోతుంది. కాగా గ్రామానికి నాలుగు రోజుల నుంచి రైతుల వ్యవసాయ పంట బోర్ల నుంచి ముదిమాణిక్యం గ్రామానికి ప్రతి రోజూ మూడు, నాలుగు గ్రామ పంచాయితీ ట్యాంకర్ ద్వారా నీటిని అందిస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి నీటి ఎద్దడి రాకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

స్కానింగ్ సెంటర్ ఏర్పాటు చేయడం హర్షణీయం

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ ప్రాంతీయ వైద్యశాలలో స్కానింగ్ సెంటర్ ఏర్పాటు చేయడం హర్షణీయమని డీఎస్‌ఆర్ ట్రస్ట్ చైర్మన్ దగ్గుపాటి బాబురావు అన్నారు. ఆదివారం ఆయన పట్టణంలో విలేకరులతో మాట్లాడారు. గతంలో 30 పడకల ఆసుపత్రిని వంద పడకలు చేసిన ఘనత ఉత్తమ్ కుమార్‌రెడ్డిదేనని అన్నారు. గత పదేళ్లుగా బ్లడ్ బ్యాంకు స్కానింగ్ సెంటర్ కావాలని సంబంధిత అధికారులను ఎస్‌ఆర్ ట్రస్టు తరుపున మొర పెట్టుకున్నా ఏర్పాటు చేయలేదన్నారు. కార్యక్రమంలో ఎం.అశోక్ కుమార్, జె.సుధాకర్, యాకోబ్, హరీష్, బెంజిమెన్, ఇసాక్, వీరబాబు, పాల్గొన్నారు.

రోడ్లపైనే వాహనాలు

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని రోడ్లపై ఎక్కడపడితే అక్కడ వాహనాలు నిలపుతున్నారు. దీంతో పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.అంతేగాక మరింత ట్రాఫిక్ సమస్య తలెత్తుతుంది. ఒక వైపు పట్టణంలో రాజీవ్ చౌక్ నుంచి రామచంద్రాగూడెం వరు రోడ్డు విస్తరణ పనులు చేపట్టారు. అయితే కొద్ది రోజులుగా రోడ్డు విస్తరణ పనులు నిలిచిపోయాయి. రోడ్లపై వాహనాల నిలపడంతో దుకాణాదారులు సైతం ఇబ్బందికి గురవుతున్నారు. ఇప్పటికైన పోలీస్ యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



రోడ్లపై నిలిపిన ద్విచక్రవాహనాలు